# గాజులు తొడిగిన చెయ్యి

"డాక్టర్ ఆనంద్ ఉన్నారా?" హాస్పటల్ వరండాలో కన్సల్టింగ్ రూము దగ్గిర స్టూలుపై కూర్చున్న అతన్ని అడిగాను. సమాధానం లేదు.

అప్పుడు గమనించాను, మానవుడు మాం...చి నిద్రలో ఉన్నాడనే సంగతిని! డ్యూటీలో వుండి... పిలిచినా వినబడనంత గాఢంగా నిద్రపోగలిగే వాళ్ళను అప్పటి వరకూ చూడలేదు. అంత భీకరమైన నిద్రని చెడగొట్టే పాపం నాకెందుకని మెల్లగా తలుపుతోసి లోపలకు చూశాను.

టేబుల్ ముందు రివాల్వింగ్ ఛైర్‌లో కూర్చున్న డాక్టరు చేతిలోని పెన్నును అటూఇటూ కదిలిస్తూ, తలకొంచెం పైకెత్తి చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. ఇంకో డాక్టరుని అపాయింట్ చేశానని ఆనంద్ చెప్పాడు గానీ మరీ ఇంత కుర్ర డాక్టరనుకోలేదు. తలుపు తోసినా అతను నావేపు చూడనేలేదు. అతని దీర్ఘాలోచనకు భంగం కలిగిస్తున్నందుకు వినయంగా క్షమాపణ కోరి ఆనంద్ గురించి అడిగాను. ఒక్క క్షణం నావేపు తేరిపార చూసి... చూపుడు వేలితో గాలిలో అడ్డంగా ఒక సున్నాచుట్టి... ఆ తర్వాత ఆగదిలో ఒకవారగా ఉన్న కుర్చీలవేపు చూపించాడు. మొదట నాకేం అర్థంకాలేదు. ఒక్క క్షణం ఆలోచిస్తే అప్పుడు అర్థమైంది. ఆనంద్ రౌండ్స్‌కెళ్ళాడన్న సంగతిని అలా చెప్పాడని.

నేనేదో అడగబోతోంటే... "బిజీగా ఉన్నాను. వెయిట్ చేయండి" అని పొడిగా ఒక మాటచెప్పి మళ్ళీ కుర్చీల వేపు వేలు చూపించాడు. ఈ డాక్టరు మాటలు మందులకంటే ప్రియం కాబోలు అంత పొదుపుగా వాడుతున్నారని అనుకుంటూ కుర్చీలో కూర్చున్నాను.

బయట ఎవరూ లేనేలేరు. ఆ డాక్టరు ఎదురుగా ఒక పెద్దాయన మాత్రం కూర్చున్నాడు. ఇంత మాత్రానికే బిజీ అంటూ అంత పోజా... నవ్వొచ్చింది.

ఎదురుగా వున్న అతనివేపు చూస్తూ డాక్టరు "మీ అమ్మాయి కోరికలకు తగ్గట్టుగా అల్లుడిని తీసుకురావటం మీకో సమస్య అయిందని అన్నారు. అంటే... మీ అమ్మాయి డాక్టర్నో, కలెక్టర్నో తప్ప పెళ్ళి చేసుకోనని అంటోందా?" అని అడిగాడు.

"కాదండి... రిక్షావాడైనా, ఆటోనడిపేవాడయినా, లారీ డ్రైవరయినా ఫరవాలేదంటోంది" అన్నాడాయన.

"నిజంగా! మరయితే అంత సర్దుబాటు మనస్తత్వం ఉన్న అమ్మాయితో ప్రోబ్లం ఏమిటీ?"

"కాకపోతే ఒక కండిషన్ పెట్టిందండి. రిక్షావాడైతే చిరంజీవిలా, ఆటో నడిపేవాడయితే నాగార్జునలా, లారీ డ్రైవరైతే బాలకృష్ణలా ఉండాలట" చెప్పాడాయన.

నాకు నవ్వాలనిపించింది కానీ ఆపుకున్నాను. డాక్టరు మాత్రం చాలా కూల్‌గా జవాబు చెప్పాడు.

"ప్రాబ్లమ్ విచారించాల్సినంత పెద్దదేంకాదు. స్క్రూ కొంచెం గట్టిగా బిగించేస్తే సరిపోతుంది. మీ అమ్మాయిని ఇక్కడకు తీసుకొచ్చి పడెయ్యండి"

ఇంతలోనే ఎవరో ఒకతను పరుగున వచ్చి గుమ్మందగ్గిరే నిలబడి "డాక్టర్... డాక్టర్... ఆ చెంబూగాడు నన్ను కొట్టాడిక్కడ" అంటూ చెంప చూపించాడు. డాక్టరుకి బాగాకోపం వచ్చినట్లుంది. గట్టిగా కసిరాడు. "యూ ఫూల్ ఎవరైనా కొడితే తిరిగి ఏం చేయాలో కూడా తెలియదా? సిగ్గులేకుండా కంప్లైంట్ చేయటానికి వచ్చావా? వెంటనే పరిగెట్టుకుని వెళ్ళి వాణ్ణి పట్టుకుని... పట్టుకునీ రెండో చెంప చూపించు...పో... గాంధీ పుట్టినదేశంలో పుట్టినవాడికి అదీ తెలీకపోతే ఎలా...?" చూడబోతే ఈ డాక్టరు కామెడీ యాక్టర్‌లా ఉన్నాడే... మనసులో అనుకుంటూండగానే ఆనంద్ నర్సు, కాంపౌండరుతో కలిసి లోపలకు వచ్చాడు.

"చంద్రం... నువ్వొచ్చి ఎంతసేపైందీ..." అంటూ నన్ను పలుకరించి డాక్టరు వేపు తిరిగి "ఏంటయ్యా రవీ... మళ్ళీ డాక్టరు ఆట మొదలుపెట్టావా?" అన్నాడు. అప్పటికే ఆ ఇద్దరూ లేచి నిలబడి గదిలో ఒకవార నిలబడ్డారు.

అతను పేషంట్ అని తెల్సి నేను స్టన్నయ్యాను. అతను ఆనంద్‌కి నమస్కారం చేసి గబగబా బయటకు వెళ్ళిపోయాడు. వెనకే ఆ పెద్దాయనా వెళ్ళాడు. డాక్టర్‌లా పోజూ... ఆ హావభావాలూ గుర్తుచేసుకుని నేను నవ్వుతూంటే ఆనంద్ అతని వివరాలు చెప్పాడు.

మెడిసిన్ సీటుకోసం రెండుసార్లు ఎమ్‌సెట్ రాసినా ఫలితం లేకపోయింది. మూడోసారి రాయనని అన్నా తల్లిదండ్రులు ఊరుకోలేదు. ఎలాగైనా డాక్టరువి కావాలంటూ మూడోసారి రాయించారు. అప్పుడూ సీటు రాకపోయేసరికి అతను డిప్రెషన్‌కి గురయ్యాడు. మందులు వాడాక తగ్గింది కానీ ఇంట్లో వాళ్ళు నిరాశగా మాట్లాడుతూండటంతో మళ్ళీ మతి తప్పింది.

తీరని తన కోరికను తోటి పేషంట్స్‌ను కూర్చోబెట్టుకుని డాక్టర్‌లా యాక్ట్‌చేస్తూ అలా తీర్చుకుంటున్నాడన్నమాట! నా మనసు ఆర్ద్రమైంది.

"మేం లేని సమయం చూసుకొని రూములోకి చొరబడిపోతుంటాడు. సీరియస్ కండిషన్ కాని వాళ్ళను ఫ్రీగానే తిరగనిస్తుంటాం" అన్నాడు.

"అవునూ... సలహా కోసం వస్తున్నట్లుగా చెప్పావ్‌గా ఫోనులో, ఏమిటదీ?" అనడిగాడు.

నా సమస్యని క్లుప్తంగా చెప్పాను.

"మా పెద్దమ్మగారి అమ్మాయి కమలక్క నాకో సంబంధం చూసింది. తన ఫ్రెండు చెల్లెలే. ఆ సంబంధం మా అందరికీ నచ్చింది. ఆ అమ్మాయి ఎగ్జామ్స్ ఈనెలలో పూర్తవుతాయి. ఇక ఈ నెలాఖరుకి ఎంగేజ్‌మెంట్ పెట్టుకుందామని అనుకునేంతలో ఒక విషయం తెలిసింది.

పెళ్ళికూతురి అక్క అంటే ఆకమలక్క ఫ్రెండు ఈ ఊళ్ళోనే ఉంటుందిలే... తను సైకియాట్రిస్ట్ దగ్గర ట్రీట్‌మెంట్ తీసుకుంటోందట. ఆరాతీస్తే నీ క్లినిక్‌లోనేనని తెలిసింది. ఆమె పేరు ఉమాదేవి..."

ఆనంద్ ఉలిక్కిపడి "ఉమాదేవా...?" అన్నాడు.

"ఏం ఆమెది సీరియస్ కేసా?" అనడిగాడు.

ఆనంద్ సర్దుకుని "కాదులే...చెప్పు..." అన్నాడు.

"వాళ్ళ అమ్మమ్మకీ ఈ జబ్బు ఉండేదని ఎవరో చెప్పారు. దాంతో అమ్మావాళ్ళకి భయం పట్టుకుంది. మెంటల్ డిసీజస్ హెరిడటరీగా తప్పకుండా వస్తాయా... ఓ జనరేషన్‌లో కాకున్నా ఇంకొక జనరేషన్‌లో ఐనా వస్తాయంటారుగా. ఆ వివరాలు తెలుసుకుని నీ సలహా కూడా అడగమని పంపించారు. అదీ సంగతి"

ఆనంద్ నిట్టూరుస్తూ "మీ సందేహానికి అవునూ అని చెప్పొచ్చు... కాదూ అని కూడా చెప్పొచ్చు. వివరంగా చెప్పాలంటే టైముపడుతుంది. తర్వాత తీరిగ్గా మాట్లాడదాం. నేను పై గదుల్లోని పేషంట్స్‌ని చూడటానికి వెళ్తున్నాను. ఉమాదేవి దగ్గరకు వెళ్దాం...పద" అన్నాడు.

ఆ గదిలో ఉమాదేవి ఒక మంచంమీద, ఆమెభర్త మధుసూదన్ ఒక మంచం మీద కూర్చొని ఉన్నారు. ఉమాదేవి అత్తగారు, ఎవరో బంధువులూ కుర్చీల్లో కూర్చున్నారు. ఆనంద్‌నన్ను వాళ్ళకి పరిచయం చేశాడు. కాకినాడ నుండి ఇక్కడకు ఏదో పనిమీద వస్తోంటే... ఉమాదేవి ఫ్రెండు కమల ఉమాదేవిని చూసిరమ్మని చెప్పడంతో నేను వచ్చినట్లుగా వాళ్ళకి ఆనంద్ చెప్పాడు. ఉమాదేవి ఇంజెక్షన్ చేయించుకోవటానికి మారాంచేసింది. "నేను బాగానే ఉన్నా. వాళ్ళకే బాగాలేదు. వాళ్ళకే చేయండి" అంటూ భర్తని, అత్తగారినీ చూపించింది.

ఆనంద్ "అలాగే, ముందు మీవారికే చేస్తాను. మీరూ నీరసంగా ఉన్నారు కాబట్టి మీకూ బలానికి ఇంజెక్షను ఇస్తా"నని అసునయంగా మాట్లాడుతూ మధుసేదనరావుగారికీ ఆ తర్వాత ఉమాదేవికీ చేశాడు.

నిద్రపోతానని చెప్పి మధుసూదనరావు వెంటనే ముసుగుపెట్టిపడుకున్నాడు. అయిదు నిముషాలు నన్ను అక్కడే కూర్చోమని చెప్పి ఆనంద్ వెళ్ళాడు. ఉమాదేవి అత్తగారిని పక్కనున్నావిడ "ఎప్పటి నుండీ మొదలైందీ... ఎలా తెలుసుకున్నారూ?" అనడిగింది.

ఉమాదేవి అత్తగారి మొహం చిటపటలాడుతున్నట్లుగా వుంది. గొంతు తగ్గించి చెబుతున్నాగానీ మనసులోని అక్కసు అంతా మాటల్లోకి వచ్చేస్తోంది.

"ఆ మధ్య బంధువులింటికి వెళ్ళాం. వాళ్ళు ఇల్లుకట్టారులే. ఇల్లంతా తిప్పి చూపించి 'కట్టటానికి రెండేళ్ళుపట్టింది. ఎలా వుంది మా ఇల్లు?' అని అడిగాడాయన. 'బ్రహ్మాండంగా ఉంది' అని నేను చెబుతూండగానే ఈ కోడలుగారు... 'దేశాన్ని ఎంత బాగా దోచుకున్నారో మీ ఇల్లు ఇట్టే చెప్పేస్తోంది...' అంది చటుక్కున.

అంతటితో ఊరుకోకుండా 'ఇంటిని మీరే కట్టినట్లుగా గొప్పలు పోతున్నారేమిటీ... శ్రీశ్రీశ్రీ ఏమన్నారూ... రాళ్ళెత్తిన కూలీలను తలుచుకోమన్నారు... మీ ఇల్లు కట్టిన కూలీలను చూపించండి,

వాళ్ళకి కం(గ్రాట్స్ చెబుతాను. అసలు వాళ్ళ ఫోటోలుకూడా ఇంట్లో పెట్టించాలి...' అంటూ ఏదో పిచ్చిపిచ్చిగా వాగడం మొదలుపెట్టింది.

అప్పటి నుండీ ఇంట్లోనూ ఇక అదేవరస! ఈ మేళాన్ని ఇంట్లో ఏం భరించగలం. ఇక్కడ చేర్పించాం. చేర్పించేటప్పుడూ పెద్దగొడవ... పిచ్చి... మా వాడికీ, మాకూ అట. మేమే హాస్పటల్‌లో ఉండాలట. కొందరలాగే ప్రవర్తిస్తుంటారనీ, అందుకు తగ్గట్టుగా ట్రీట్‌మెంట్ ఇవ్వాలని డాక్టరు అన్నారు. అందుకే తన మాటలు నమ్మినట్లుగా వాడినే చేర్పిస్తున్నామని తనని తోడుకోసం ఉండమని అన్నాం. మందుల దగ్గిరా అదే గొడవ చూశావుగా! వాడికేవో విటమిన్ టాబ్లెట్సూ. గ్లూకోజ్, డిస్టిల్డ్ వాటరో ఇంజక్షన్స్ చేస్తూ, తనకి మందులువాడుతున్నారు" చెప్పిందావిడ.

ఉమాదేవి అత్తగారు చెబుతోంటే... ఆవిడ 'అలాగా... అలాగా...' అంటూ ఆసక్తిగావింది.

ఉమాదేవి అత్తగారు మళ్ళీ మొదలు పెట్టింది. "మా వంశంలో అటూ ఇటూ ఎవరూ పిచ్చి వాళ్ళులేరు మరి" మనసులోని కోపం వల్ల స్వరం పెరిగింది.

ఉమాదేవికీ మాటలు వినిపించినట్లున్నాయి.

"ఏంటమ్మా గొప్పలు చెబుతున్నావ్... వినే వాళ్ళు అంతా పిచ్చివాళ్ళే కదా అనా...? నేనున్నానని మర్చిపోయావా...? మనిషి జన్మ ఎత్తినవాళ్ళెవరికైనా జబ్బు, జ్వరం రాకుండా ఉంటాయా? శరీరానికి వచ్చినట్లే...కొందరికి మనసుకూ జబ్బు చేస్తుంది. మీ వంశంలో ఎవరికీ మానసికవ్యాధి రాలేదంటే అర్థం ఏమిటో తెలుసా... ఎవరికీ మనసనేది లేనేలేదని..." పెద్దగా పకపకానవ్వి ఒక్క క్షణం ఆగి మళ్ళీ అంది "మనసు కలతపడినప్పుడు కలిగే నలతకు భయం దేనికీ... నయం చేసుకోవాలిగానీ..."

ఆ మాటలు నాకే చెబుతున్నట్లుగా అనిపించి మనసులోనే ఒక్కక్షణం ఉలిక్కిపడ్డాను.

ఉమాదేవి అత్తగారి మొహంలో రంగులు మారిపోయాయి. ఒక్కక్షణం ఏం తోచనట్లుగా అటూ ఇటూ చూసి పక్కనున్నావిడతో మాటలు కలిపింది.

"ఆ మధ్య మీ కోడలుతో ఏదో గొడవ వచ్చిందన్నారు. ఏమిటీ?" అంటూ ఆరా తీసింది.

ఆవిడ పెద్దగా నిట్టూర్చింది. "నీకూ తెలిసిందా... ఇంత విడ్డూరం ఎక్కడా ఉండదుమరి! తెలీకుండా ఎలా ఉంటుందిలే. వీడు హైస్కూలులో చదువుకున్నప్పటి మాష్టారి కూతురట. ఇక్కడే ఉద్యోగం చేస్తోంది. ఆ అమ్మాయిని ప్రేమించానంటే సరేనని పెళ్ళిచేశాం. మా ఇంటికి వచ్చాక కోడల్ని బంధువులావిడ 'పెళ్ళిలో నీకు మీ అత్తగారు పెట్టిన నగలు చూపించమ్మా' అనడిగింది. వాటిని చూపిస్తూ ఏం చెప్పిందో తెలుసా...? అవన్నీ తన పుట్టింటివాళ్ళు కొన్నవేనట. అంతేకాక పెళ్ళికి మా ఇంటికి వేయించిన పెయింటింగ్స్ మొదలుకొని రెండు మూడు నెలలకు సరిపడా సరుకులు తెప్పించటం వగైరా ఖర్చులన్నీ వాళ్ళ వాళ్ళే పెట్టారట! నేనక్కడే ఉన్నా. విస్తుపోయి, 'మేంపెట్టినవి పెట్టలేదనీ, వాళ్ళుపెట్టనివి పెట్టినట్లూ ఎందుకలా అబద్దాలు చెబుతున్నావ్?' అని నిలదీశాను. నంగనాచిలా మొహం పెట్టి 'అబద్దం ఏం ఉందీ. నిన్న మీరే మామయ్యగారితో మా వాళ్ళిచ్చిన కట్నం డబ్బుకి ఈ ఖర్చుల వివరాలు చెప్పారుగా' అంది.

పెళ్ళికి ముందు మావాడితో 'నాకు చీరెలూ, నగలూ పెట్టనవసరంలేదు. మీరూ కట్నం అడగొద్దు' అని చెప్పిందట. కానీ నేను ఒప్పుకోలేదు. అందుకని అది మనసులో పెట్టుకుని నలుగురిలో నన్ను అలా అవమానం చేసిందన్నమాట" అంటూ ఆగిందావిడ.

పక్కనే కూర్చునివున్న పుత్రరత్నానికి పౌరుషం వచ్చింది కాబోలు.

"అవమానం చేస్తే చూస్తూ ఊరుకోవటానికి నేనేం గాజులు తొడుక్కోలేదు... పుట్టింటికి వెంటనే రైలెక్కించాను కొంచెం పొగరు తగ్గించుకోమని చెప్పి... బోడి బడిపంతులు కూతురికే అంతవుంటే... మగాడిని నాకు ఉండదా...! బాబైనా మంచీ చెడ్డా కూతురికి చెప్పి తిరిగి తీసుకొచ్చి అత్తగారింట్లో వదిలిపెట్టాలా, అదేంలేదు. వాడూ వూరుకున్నాడు. కొన్నాళ్ళుపోతే తెల్సివచ్చి కాళ్ళబేరానికి వాళ్ళేవస్తారని నేనూ వూరుకున్నా." తల ఎగరేస్తూ దర్పంగా అన్నాడు.

అంతా ఒక క్షణం నిశ్శబ్దంగా ఉండిపోయారు. మంచం మీద పడుకున్న ఉమాదేవి లేచి కూర్చుని రెండు క్షణాలు అందరివేపూ మార్చి మార్చి చూసింది. ఊడిన వెంట్రుకలను ముడివేసుకుంది. మెరుపులావచ్చి ఆ అబ్బాయి గుండెల దగ్గిర షర్టును ఓ చేత్తో బిగించిపట్టుకుంది. రెండో చెయ్యి విసురుగా పైకిలేచింది. గాజుల గలగలలతో కలిసి 'టపటప' అన్న శబ్దాలకు అదిరిపడ్డాను! అతని చెంపలపై ఉమాదేవి చేతివేళ్ళ వాతలు కనుపించాయ్!

కళ్ళు పెద్దవిచేసి చూస్తూ గర్జించింది. "వాళ్ళకి తెలిసిరావాలా... నీకేం కావాలో నువ్వు తెలుసుకోలేకపోయావుగానీ... కట్నకానుకలతో పెద్దవాళ్ళు చూసిన పిల్లమెడలో తాళికట్టక, వీరుడిలా ప్రేమ అంటూ ఆ పిల్లవెంట ఎందుకుపడ్డావ్...! ప్రేమించానని చెప్పి కట్నం తీసుకున్నందుకు ఆ అమ్మాయి మనసుకి కష్టం కలిగి అలా మాట్లాడిందేమో. అది తెలుసుకో కుండా, తప్పు నీ దగ్గిర పెట్టుకుని పుట్టింటికి పంపానని గొప్పలు చెప్పుకుంటున్నావా? నీ కంటె వయసులో పెద్దాయన... పిల్లనిచ్చిన మామగారే కాకుండా ఒకప్పుడు నీకు చదువుచెప్పిన గురువుగారిని... వాడు, బోడి అంటూ పిచ్చివాగుడు వాగుతావా! రోషం, పౌరుషం ఉండటానికీ, లేకపోవటానికీ, ఆడ, మగ తేడాలేదు. గాజులు అలంకారానికి వేసుకునేవేగానీ పిరికితనానికి చిహ్నాలుకావు! ఇంకెపుడూ ఆమాట అనకు... తెల్సిందా...!"

ఒక నిముషంలోనే మళ్ళీ శాంతమూర్తిలా మారి మంచం దగ్గరకు వెళ్ళి కూర్చుని తనలో తనే ఏదో మాట్లాడుకోవటం మొదలుపెట్టింది. ముందు రెండు క్షణాలు మా అందరివేపూ ఉమాదేవి ఎందుకుచూసిందో అప్పుడు నాకర్థమైనట్లు అన్పించింది. అతని అహంకార పూరిత మాటలకు మేం స్పందించకుండా నిశ్శబ్దంగా ఉండిపోయాం మరి! నేనక్కడుండటం బావుండదన్పించి ఆనంద్ రూముకొచ్చేశాను.

"సారీ... లేటయింది" అంటూ రెండు నిముషాలకే ఆనంద్ వచ్చాడు. స్థిమితంగా కూర్చుని "ఇప్పుడు నీ సందేహాలకి సమాధానాలు చెబుతాను. విను..." అంటూ ఆనంద్ చెబుతోంటే నేను అడ్డంపడ్డాను.

"అవసరంలేదు. నా సందేహం తీరిపోయింది. ఎటువంటి సంకోచాలూ, భయాలూలేకుండా ఆ అమ్మాయినే పెళ్ళిచేసుకోవాలనే నిర్ణయానికి వచ్చానిపుడే"

"నిజంగా!" అంటూ ఆనంద్ నన్ను అభినందించాడు.

ఒక క్షణం... ఏదో చెప్పనా... వద్దా అన్నట్లుగా తటపటాయించి మళ్లీ చెప్పాడు. "నీకో నిజం చెప్పనా...! ఉమాదేవి శారీరకంగా, మానసికంగా పూర్తి ఆరోగ్యవంతురాలే. మధుసూదన్‌కే ఇక్కడ ట్రీట్‌మెంట్ ఇస్తున్నాం"

నేను అదిరిపడి "అదేమిటీ...!" అన్నాను.

"అవును. అతనిలో వచ్చిన మానసికమైన మార్పును ముందుగా ఉమాదేవే గుర్తించింది. హాస్పటల్‌కి కాకుండా ఏదో కారణంతో మా ఇంటికి తీసుకొస్తానని పరీక్ష చేయమని అడిగితే సరేనన్నాను. ఆమె అనుమానం నిజమేనని నిర్ధారణచేసి చెప్పాను. అపుడామె తనకో సాయం చేయమని అర్థించింది. తనకే మెంటల్ డిసీజ్ వచ్చినట్లుగా హాస్పటల్‌లో చేరతాననీ, అతనిని తోడుగా ఉంచినట్లుగా ఉంచి ట్రీట్‌మెంట్ ఇవ్వాలని కోరింది. ఉమాదేవి అత్తగారిని చూశావుగా... ఆవిడ మధుసూదన్‌రావుకి సవతి తల్లి. ఆమెకు ముగ్గురు కొడుకులు. అందరూ పెద్దచదువులు చదివారు. ఉమాదేవి భర్త మాత్రం డిగ్రీచేసి తండ్రికి బిజినెస్‌లో తోడుగా ఉండిపోయాడు. అతని పెళ్ళైన ఏడాదికే తండ్రి చనిపోయాడు. సవతితల్లి, తమ్ముళ్ళు... అతనిని బిజినెస్‌లో ఏ నిర్ణయాలూ తీసుకోనివ్వకుండా నీకేం తెలియదంటూ చిన్నచూపు చూడటం మొదలు పెట్టారు. అలా అతనిలో ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సును డెవలప్ చేశారు. అతనికి మెంటల్ డిసీజ్ వచ్చిందని ఇంట్లో వాళ్ళకి తెలియటం అంటే... అతనిని మానసికంగా గాయపరచటానికి వీలైన ఆయుధం వాళ్ళచేతికి దొరికినట్లే. ట్రీట్‌మెంట్ తీసుకుని కోలుకున్నాక కూడా అయినవాళ్ళు జాగ్రత్తగా చూసుకోవాలి.

కానీ, ఇంట్లో వాళ్ళు అతని వ్యాధిని గుర్తుచేస్తూ అవహేళన చేస్తారనీ, తన భర్త మనసు చాలా సున్నితమనీ, అలాంటి పరిస్థితిని తట్టుకోలేడనీ ఉమాదేవి చెప్పి నా సహాయాన్ని కోరింది. భర్త పట్ల ఆమెకున్న శ్రద్ధాసక్తులకీ, అనురాగానికీ ఇంప్రెస్ అయి అంగీకరించాను. నీ ద్వారా ఎవరికీ ఈ విషయం తెలీదనే నమ్మకంతో, సందర్భాన్ని బట్టి నీకు చెప్పటమే సమంజసంగా ఉంటుందని చెప్పాను"

ఆ మాటలకు దిగ్భ్రాంతికి లోనైన నేను లేచి ఒకసారి ఉమాదేవిని చూసివస్తానని చెప్పాను. ఆనంద్ కంగారుపడుతూ "ఈ విషయాలన్నీ ఆమెతో మాట్లాడతావా?" అన్నాడు.

"అదేం కాదు. నా ద్వారా ఎవరికీ ఈ విషయం తెలియదులే. ఎందరో మహాతల్లులు... అందరికీ వందనాలు చేయలేంగానీ, ఒక్కసారి ఉమాదేవిగారికి నమస్కరించాలనిపిస్తోంది" అని చెప్పి పైకివెళ్ళాను.

నా రాకతో మళ్ళీ ఎందుకొచ్చానన్నట్లుగా ఆమె అత్తగారు మొహం చిట్లించి చిరాగ్గా చూసింది.

"ఇందాక ఉమాదేవిగారికి చెప్పి వెళ్ళటం మర్చిపోయాను" అంటూ ఉమాదేవి మంచం దగ్గరకు వెళ్ళి రెండు చేతులూ జోడించి మనస్ఫూర్తిగా నమస్కరించాను.

ఆమె కూడా రెండు చేతుల్నీ అటూ ఇటూ తిప్పి నమస్కారం చేసింది. ఆ చేతి గాజులశబ్దం... మధుర మంజుల నాదంలా నా మనసును అలరించింది. ఆమె అభినయానికి లోలోన మనసారా నవ్వుకున్నాను.

ఆ రోజే నేనొక విషయం తెలుసుకున్నాను... ఏ మగవాడైనా తన పౌరుషం గురించి చెప్పుకునేటప్పుడు 'నేనేం గాజులు తొడుక్కోలేదు' అనే మాటని ఉపయోగించటం సరి కాదని అవును... లాలించే గాజుల చేతులు అవసరమైనప్పుడు మగవాడికంటే కూడా దృఢంగా కొరడాని ఝుళిపించగలవు మరి!!.

స్వాతి వీక్లీ. 27, ఆగస్టు, 2004.